ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు

3★★★

శుక్రవారం 10 జనవరి 2025



ముక్కోటి దేవతలు దిగి వచ్చే వేళ..

- పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శనం

6



గరుడ వాహనంపై స్వామివారు, తరలివచ్చిన భక్తులు (ఫైల్)

ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన రాజన్న ఆలయం

స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేసిన అధికారులు

5



క్యూలైన్‌లో ఏర్పాట్లు చేసిన అధికారులు

'మల్కపేట'పై ఆశలు



మల్కపేట రిజర్వాయర్‌లో పంప్‌ల ద్వారా నీటి ఎత్తిపోతలు

- రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు
- మిడ్‌మానేరు నుంచి రెండు టీఎంసీల నీళ్లు
- యాసంగి, వేసవిలో తీరనున్న నీటి సమస్య
- ట్రయల్‌రన్ తరువాత 18 నెలలకు ఎత్తిపోతలు
- 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టు
- కాళేశ్వరం ప్రాజెక్ట్ లోపాలతోనే జాప్యం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సిరిసిల్ల మెట్ట ప్రాంతాలకు గోదావరి జలాలతో సాగునీరు అందించే దిశగా చేపట్టిన ప్రాజెక్ట్‌ల్లో కాళేశ్వరం 9వ ప్యాకేజీలో మిగిలిన మల్కపేట రిజర్వాయర్ లోకి శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియ ప్రారంభించడంతో రైతులు ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తుందనే ఆశలు మొదలయ్యాయి. ఇటీవల రైతులు భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని ఆందోళన చెందుతున్న క్రమంలో ప్రాజెక్ట్‌లోకి నీటిని నింపే ప్రక్రియను చేపట్టారు. దీంతో యాసంగి సాగుతో పాటు వేసవిలో నీటి సమస్యకు ఉపశమనం కలుగుతుందని రైతులు భావిస్తున్నారు. జిల్లాలోని కోనరావుపేట మండలం మల్కపేట వద్ద మూడు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్ట్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధమైనా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఏర్పడిన లోపాలతో రైతులకు చేరువకాకుండా పోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుతో ప్రారంభోత్సవం చేయించడానికి రెండుసార్లు ఏర్పాటు చేసినా వాయిదా పడింది. ప్రాజెక్ట్‌కు మాజీ ఎమ్మెల్యే దివంగత సీహెచ్ రాజేశ్వర్‌రావు పేరును పెట్టారు. గత నవంబరులో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భంలో ప్రారంభోత్సవం చేస్తారని భావించినా నిరాశే కలిగింది. 2023 మే, జూన్ మాసాల్లో మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటిని నింపడానికి ట్రయల్ రన్ నిర్వహించారు. దాదాపు 18నెలల తరువాత మళ్లీ బుధవారం మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటిని నింపే ప్రక్రియను చేపట్టారు. గురువారం రెండు పంప్‌లతో నీటిని నింపడం వేగవంతం చేయడంతో ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తుందని రైతుల్లో ఆశలు మొదలయ్యాయి. ప్రాజెక్ట్ ప్రారంభం కాకపోయినా భూగర్భజలాలు పెరుగుతా యని భావిస్తున్నారు. మూడు టీఎంసీల సామర్థ్యం ఉన్నా ప్రాజెక్ట్‌లోకి 2 టీఎంసీల నీటి నిల్వను ఉంచే విధంగా నీటిని నింపుతున్నారు.

మెట్ట ప్రాంతానికి తాగు, సాగునీరు

గోదావరి జలాల పరవళ్లతో రాజన్న సిరిసిల్ల జిల్లా కళకళలాడింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఏర్పడ్డ అవాంతరంతో ఆందోళనలు ఏర్పడ్డా

దేవాదాయ భూముల రక్షణకు చర్యలు

నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్



ఫటాఫట్

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో ఆక్రమణకు గురైన దేవాదాయ శాఖకు చెందిన భూముల స్వాధీనం-పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సమాధానం: ఆక్రమణకు గురైన భూములను తొలుత గుర్తించి వాటిని అమ్మకుండా సంబంధిత రిజిస్ట్రేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ యాక్ట్‌లోని సెక్షన్ 22(ఎ)(1)(సి) ప్రకారం నిషేధిత భూముల కింద నమోదు చేయిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో 57 కేసులు హైకోర్ట్‌లో, 27 కేసులు ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో నమోదయ్యాయి.

ప్రశ్న: ఆలయాలను తనిఖీ చేస్తున్నారా?

సమాధానం: ప్రతీ నెల పది ఆలయాలను తనిఖీ చేస్తున్నాం. భక్తుల సౌకర్యాలు, పరిశుభ్రత, సీసీ కెమెరాలు, ప్రతీ యేటా జరిగే వేడుకల నిర్వహణపై అర్చకులు, అధికారులు, సిబ్బందితో చర్చిస్తున్నాం.

ప్రశ్న: ఆలయాల్లో, కార్యాలయంలో సిబ్బంది కొరతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సమాధానం: ఆలయాల్లో, కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే.. ఉత్సవాల సమయంలో, భక్తులు రద్దీగా ఉన్న సమయంలో సేవా సంస్థల సభ్యులు, ఇతర ఆలయాల ఉద్యోగుల సేవలు వినియోగించుకుంటున్నాం.

ప్రశ్న: ఎన్ని ఆలయ కమిటీల ఏర్పాట్లు పూర్తయ్యాయి?

సమాధానం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 ఆలయాల కమిటీలకు నోటిఫికేషన్ వచ్చింది. వీటిలో ఐదింటికి ట్రస్టు బోర్డులు ఏర్పాటయ్యాయి. మూడు ఆలయాలకు దరఖాస్తులు రాలేదు. 27 ఆలయాల కమిటీలకు వివిధ దశల్లో ప్రక్రియ కొనసాగుతోంది.

- కరీంనగర్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..

- జర జాగ్రత్తలు తీసుకోండి
- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల క్రైం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ఊరెళ్తున్నారా... అయితే జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. చోరీల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెలవుల సందర్భంగా పట్టణాల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లేటపుడు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. రాత్రివేళల్లో వీధుల్లో గస్తీ బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఊరెళ్లటపుడు ఇంట్లో లైటు వేసి వెళ్లాలని, బీరువా తాళాలను ఇంట్లో ఉంచకుండా వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఇళ్లకు సెంట్రల్ లాకింగ్ విధానాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వాచ్‌మెన్‌ను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రయాణాల్లోనూ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, దొంగలు చేతివాటం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దొంగతనాలు తగ్గించడానికి 50నుంచి 100 మంది సంఘంగా ఏర్పడి వారి ప్రాంతాలకు గస్తీ తిరగడానికి వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని సూచించారు. ఊరికి వెళ్లేటపుడు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో గ్రామపోలీసు అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

రేపటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు

- జిల్లావిద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : టైలరింగ్, డ్రాయింగ్ టెక్నికల్ సర్టిఫికేట్ కోర్స్ పరీక్షలు ఈ నెల 11 నుంచి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్ నుంచి పరీక్షలకు సంబంధించినహాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఈ నెల 11నుంచి 17వ తేదీవరకు ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు 11, 12, 16, 17వ తేదీలల్లో ఉదయం, మధ్యాహ్నం ఉంటాయన్నారు. టైలరింగ్,ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షలు 11న ఉదయం మధ్యాహ్నం రెండు పూటలు నిర్వహిస్తామని తెలిపారు. హయ్యర్ పరీక్షలు 12వ తేదీన ఉదయం , మధ్యాహ్నం, 16న ఉదయం జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. పరీక్షలకు హాజరైయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్ నుంచి హాల్‌టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకునే అొకాశాన్ని కల్పించడం జరిగిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లావిద్యాధికారి కోరారు.

టీటీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా రవి



ఇల్లంతకుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడుగా యాద రవిని నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొండికొప్పుల రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రవి తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్, విద్యార్థి సంఘాల నాయకులు హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాఠశాలలు, కళాశాలల సమయానికి బస్సులను నడిపించి సమస్యను పరిష్కరించాలని కోరారు. నాయకులు సంతోష్ గౌడ్, సందీప్, నీలేశ్ తదితరులు ఉన్నారు.

పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

గంభీరావుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు బలహీన వర్గాలకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి అన్నారు. గంభీరావుపేటలోని షాదీఖాన భవనంలో గురువారం 146 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు సంబంధించిన కోటి 46 లక్షల 16 వేల 936 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, ఏఎంసీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, ఎంపీడీవో రాజేందర్, నాయకులు పర్శరాములు, గంగిస్వామి, రాజుగౌడ్, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయి శిక్షణ

- రాష్ట్రంలోనే ప్రథమంగా జిల్లాలోని కేజీబీవీల్లో ఐఐటీ, జేఈఈ, నీట్ పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్రారంభం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



చందుర్తి కేజీబీవీలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

చందుర్తి/వేములవాడ రూరల్/రుద్రంగి జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభించామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలలో ఐఐటి, జేఈఈ, నీట్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చందుర్తి, వేములవాడ రూరల్ మండలలలోని మర్రిపల్లి, రుద్రంగి మండలకేంద్రంలోని కేజీబీవీల్లో విద్యార్థినులకు ఐఐటీ, జేఈఈ, నీట్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమర్‌ఝాతో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఆనంతరం చందుర్తి, మర్రిపల్లి, రుద్రంగిలోని విద్యాలయంలోని స్టోర్ రూం, వంటగదిలను, భోజనశాలను పరిశీలించారు. నిత్యవసరాలను, బియ్యం, కూరగాయలను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. చందుర్తిలో టాయిలెట్స్ నిర్మాణం చేపడతామని విప్ పేర్కొన్నారు. పాఠశాలలో పిచ్చి మొక్కలు, గడ్డి వంటి వాటిని తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. చందుర్తి కేజీబీవీలో గదులకు నూతన రంగులు వేయాల్సిందిగా విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జిల్లాలోని 13 కేజీబీవీలలో ఐఐటి, జేఈఈ, నీట్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను అమలు చేస్తున్నామని వెల్లడించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేకశ్రద్ధ తీసుకొని కేజీబీవీల్లో ఆన్‌లైన్ క్లాసులు ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. కోచింగ్ సద్వినియోగం చేసుకొని ఐఐటి, జేఈఈ, నీట్‌లలో సీట్లు సాధించాలని ఆకాంక్షించారు. శిక్షణ తరగతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. 10వ తరగతిలో 10/10 జీపీఏ సాధిస్తే స్వయంగా వచ్చి సన్మానం చేస్తానని విప్ తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఇచ్చే కోచింగ్ ప్రభుత్వ సహాయంతో కేజీబీవిలో అందిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వివరించారు. మధ్యతరగతి కుటుంబాలలోని విద్యార్థులకు దేశంలోనే ఉత్తమ సంస్థల్లో అందించే కోచింగ్‌ను అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్కాన్ చేయండి.. అభిప్రాయాలను తెలపండి

- పోలీస్ సేవలపై పోస్టర్ ఆవిష్కరణ



పోలీసులు విడుదల చేసిన క్యూఆర్ కోడ్ పోస్టర్

సిరిసిల్ల క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్కాన్ చేసి పోలీస్ సేవలపై అభిప్రాయాలను తెలియజేయాలని డీజీపీ జితేందర్ పిలుపునిచ్చారు. పోలీసుల పనితీరు, పోలీసులపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను గురువారం డీజీపీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులు సమస్యలు విన్నవించేందుకు పోలీస్‌స్టేషన్లకు వెళ్లిన అనంతరం పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరు, ఫిర్యాదులు, పాస్‌పోర్ట్ వేరిఫికేషన్, ఈ-చలాన్, ఎఫ్ఐఆర్, ఇతర సేవల గురించి పోలీస్ సిబ్బందిపై ప్రజలకు ఉన్న అభిప్రాయాలను సేకరించేందుకు క్యూఆర్‌కోడ్ అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. పోస్టర్లు పోలీస్ కమిషనర్ కార్యాలయంతో పాటు అన్ని పోలీస్‌స్టేషన్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ కార్యాలయాల్లో స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయం, సబ్ డివిజన్ కార్యాలయల్లో, సర్కిల్ కార్యాలయల్లో, అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో వుండే విధంగా క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోని పోలీస్‌సేవలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

గంభీరావుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను, సంక్రాంతి పండగ ప్రాముఖ్యాన్ని తెలియజేసే విధంగా వివిధ రంగులతో ముగ్గులను వేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముగ్గులను పరిశీలిస్తున్న అధ్యాపకులు →



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అజయ్(ఫైల్)

మానకొండూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామ శివారులో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై గురువారం లారీని వెనక నుంచి మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దూరుపల్లికి చెందిన గంగినేని అజయ్ (23) అనే యువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు తన మోటార్‌సైకిల్‌పై వెళ్లి విధులు ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చేవాడు. గురువారం ఉదయం బైక్‌పై కరీంనగర్‌కు వెళుతున్నాడు. ఆ సమయంలో హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ డ్రైవర్ ముంజంపల్లి గ్రామ శివారులో ఒక్కసారిగా బ్రేక్ వేసి వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశాడు. బైక్‌పై వెళుతున్న అజయ్ లారీని వెనుకనుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

లారీ డ్రైవర్ పారిపోతుండగా గ్రామస్థులు వెంబడించి మానకొండూర్‌లో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అజయ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో గురువారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వెళ్తోంది. తాడికల్ శివారు నుంచి వెళ్తున్న సమయంలో రామగుండం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దీంతో వెనుక సీట్లో కూర్చున్న కరీంనగర్‌కు చెందిన కృష్ణవేణి, జ్యోతిలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని ఆస్పత్రికి తరలించారు.

రైల్వే వ్యాగన్ల నుంచి తరలిస్తున్న బొగ్గు పట్టివేత



పట్టుబడిన బొగ్గు ట్రాక్టర్‌తో సెక్యూరిటీ సిబ్బంది

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అక్రమంగా సింగరేణి బొగ్గును తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి ఆర్జీ-2 ఎస్అండ్‌పీసీ సిబ్బంది పట్టుకున్నారు. ఇటీవల రైల్వే వ్యాగన్ల నుంచి బొగ్గు చోరీకి గురవుతుండడంతో నిఘా పెట్టిన సెక్యూరిటీ సిబ్బంది ఎల్కలపల్లి గేట్ సమీపంలో పోచమ్మగుడి వద్ద బొగ్గును తరలిస్తున్న ట్రాక్టర్(టీఎస్ 22టీ 0658)ను ఆర్జీ-2 ఎస్అండ్‌పీసీ సిబ్బంది పట్టుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది రాకను గమనించిన దుండగులు ట్రాక్టర్‌ను వదిలిపారిపోయారు. ట్రాక్టర్‌తో పాటు లోడ్ చేసిన ఆరు టన్నుల బొగ్గును సిబ్బంది జీఎం ఆఫీస్‌కు తరలించారు. ఆర్జీ-2 సెక్యూరిటీ ఆఫీసర్ మహమ్మద్ షరీఫ్‌తో పాటు షిఫ్ట్ మేనేజర్ సంపత్, విజయ్‌కుమార్, ఎంటీఎఎఫ్ గార్డులు రమేష్, రత్నం దేవదాసు, ఇంటలిజెన్స్ గార్డు నీలం రవిలు చాకచక్యంగా ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఆర్జీ-2 జీఎం బీ వెంకటయ్య వారిని అభినందించారు.

ఇసుక డంపుల స్వాధీనం



ఆత్మనగర్‌లో ఇసుక డంపులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం గ్రామ శివారులో సుమారు 50 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను నిల్వలను అధికారులు గుర్తించారు. తహసీల్దార్ శ్రీనివాస్ అదేశాల మేరకు అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పనితీరుపై పార్టీ కార్యకర్తలు సంతోషంగా లేరు.. తీరును మార్చుకుని కార్యకర్తలను పట్టించుకోండి..'
టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



'నేను మారాను.. మీరూ మారండి.. పార్టీ ఎమ్మెల్యేలు సహా ప్రజాప్రతినిధులందరి పనితీరుకు సంబంధించిన రిపోర్ట్ నా దగ్గర ఉంది. పనిచేయని వారిని ఉపేక్షించేది లేదు'
నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కాంగ్రెస్‌లో
వార్నింగ్‌ల వణుకు



- పనితీరు మార్చుకోవాలని నేతలకు అధిష్టానం హెచ్చరిక
- మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి
- తమను పట్టించుకోవవడం లేదని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల ఆవేదన



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పార్టీ అగ్రనేతల హెచ్చరికలు కాంగ్రెస్ పార్టీలో కలకలం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఇద్దరు నేతల హెచ్చరికలతో షాక్‌లో ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేదని, కొందరు పార్టీ నేతలను, కార్యకర్తలను పట్టించుకోకుండా ఇతర దందాల్లో నిమగ్నమై పార్టీకి నష్టం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న సర్వే రిపోర్టులో ఉందని ప్రచారం జరుగుతోంది.

ఉమ్మడి జిల్లా పరిధిలో కూడా కొందరి పనితీరు బాగా లేదని వెల్లడైనట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఇప్పుడు ఆ కొందరు ఎవరు అంటూ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా నామినేటెడ్ పదవుల భర్తీ జరగలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ అధికారిక కార్యకలాపాల్లో పాల్గొనడం మినహా కార్యకర్తలతో సమయమిచ్చి మాట్లాడడం లేదనే విమర్శలున్నాయి. తమను పట్టించుకునే వారే లేరని ద్వితీయ శ్రేణి నేతలు, ముఖ్య కార్యకర్తలు వాపోతున్నారు. ఎమ్మెల్యేల పనితీరు సందర్భంగా వెల్లడైన రిపోర్టులో ఈ అసంతృప్తి గురించి స్పష్టంగా పేర్కొన్నారని, దానిని సీరియస్‌గా తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతలను హెచ్చరించారనే చర్చ జరుగుతోంది. సీఎం, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హెచ్చరికలతో ఎమ్మెల్యేల్లో కలవరం మొదలైనట్లు తెలిసింది.

ముగ్గురు ఎమ్మెల్యేల పనితీరుపై నెగెటివ్ రిపోర్టు

ఉమ్మడి జిల్లా పరిధిలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. జగిత్యాల ఎమ్మెల్యే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో తొమ్మిదిమంది ఎమ్మెల్యేలు అధికార పార్టీలో ఉన్నారు. వీరిలో శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రులుగా ఉన్నారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురి పనితీరుపై నెగెటివ్ రిపోర్టు వచ్చిందని తెలిసింది. అందులో తమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉన్నాడా లేడా అని కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు. ఏ నలుగురు కాంగ్రెస్ నేతలు కలిసినా ఆ ఎమ్మెల్యేలు ఎవరు అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నా స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేలు దృష్టిసారించడం లేదని, స్థానిక నేతలతో సమస్యలేమిటి, వాటిని ఎలా పరిష్కరించాలి అనే ప్రణాళికలు రూపొందించుకునే ప్రయత్నాలు జరగడం లేదనే విమర్శలున్నాయి. స్థానిక ఎన్నికల్లో గెలవాలంటే ఎవరికి అవకాశం కల్పిస్తే బాగుంటుంది అనే విషయాన్ని కూడా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తమవుతున్నది. సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీలు ఇచ్చినంత మాత్రాన సరిపోదని, ఏడాది కాలంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితాలను గ్రామ స్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు జరగాలంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని స్థాయిల నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యేలు కలిసిమెలిసి తిరిగినప్పుడే ఇది సాధ్యమవుతుందని, ఇప్పటికైనా ఎమ్మెల్యేలు తమను పట్టించుకున్నారని ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు కోరుతున్నారు.

ఫుడ్ పాయిజన్ ఘటనలో ఇద్దరి సస్పెన్షన్

గణేశ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని శర్మనగర్‌లో గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఆ రోజు విధుల్లో ఉన్న పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌తో పాటు వసతి గృహ ఉపసంక్షేమాధికారి ఉమాదేవిని విధుల్లో నుంచి తొలగిస్తూ, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి సైదులు ఉత్తర్వులు జారీ చేశారు. అదే పాఠశాలలో అధ్యాపకురాలిగా కొనసాగుతున్న సుజాతను తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు.

మంటల్లో చిక్కుకుని యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలోని యువకుడు నమిలికొండ నూతన్ వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని బుధవారం రాత్రి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతన్ తన తల్లి రాజవ్వ, సోదరుడు నరేశ్‌లతో కలిసి రామన్నపేటలో ఉంటున్నాడు. తల్లి రాజవ్వ బంధువుల ఇంటికి వెళ్లగా సోదరుడు నరేశ్ పని నిమిత్తం బయటకు వెళ్లాడు. ఒంటరిగా ఉన్న నూతన్ కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న క్రమంలో మూర్ఛ వచ్చి పొయ్యిపై పడడంతో మంటల్లో చిక్కుకున్నాడు. కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చిన నూతన్ కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు చేరుకుని మండల కేంద్రంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి



కార్తీక్(ఫైల్)

మల్లాపూర్, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన నేదునూరి కార్తీక్(14) అనే బాలుడు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేదునూరి రాజం ఆరేళ్ల క్రితం చిత్తూర్ ప్రాంతం నుంచి కార్తీక్‌ను దత్తతకు తెచ్చుకున్నాడు. బుధవారం సాయంత్రం కార్తీక్ బయటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వ్యవసాయ పరిసరాల్లో వెతుకుతుండగా గ్రామ శివారులోని బావి ఒడ్డుకు కార్తీక్ చెప్పులు, బట్టలు కనిపించాయి. దీంతో బావిలో వెతకగా కార్తీక్ మృతదేహం లభించింది. కార్తీక్ చేపలు పట్టేందుకు బావి వద్దకు వెళ్లి ఈతరాక మునిగి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు భావిస్తున్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వశ్రీరాంపూర్-పొత్కపల్లికి వెళ్లే రహదారి పనుల కోసం పాండవుల గుట్ట నుంచి మట్టి తరలిస్తుండగా గురువారం టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ 597సర్వే నంబరులోని పాండవులగుట్ట కబ్జా అవుతోందని, అంతేకాకుండా మట్టిని తరలించుకుపోతుంటే కొందరు భూమిని కబ్జా చేసి అక్రమంగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందన్నారు. ఎస్సై వెంకటేష్ టిప్పర్లు అడ్డుకున్న గ్రామస్థుల వద్దకు వచ్చి ప్రభుత్వ అభివృద్ధి పనులకు మట్టి తీసుకెళ్తున్నారని టిప్పర్లు అడ్డుకునే అధికారం లేదని, సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని గ్రామస్థులకు తెలియజేశారు. అధికారులు, పట్టించుకోవడం లేదని అందుకే అడ్డుకున్నామని గ్రామస్థులు తెలిపారు.

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన పెద్దపల్లి ఎంపీ

- పారిశుధ్య లోపంపై ఆగ్రహం
- విద్యార్థులతో కలిసి భోజనం



వాష్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

గోదావరిఖని, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గురువారం గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లోని జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వాష్‌రూమ్‌లు, భోజనశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాష్ రూమ్‌ల నిర్వహణ సరిగా లేకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకంతో ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పిస్తున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సొంత పిల్లల్లా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రుల పేర్లు నిలబెట్టాలన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బంది తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని ఎంపీ తెలిపారు.

ఆరేళ్లుగా.. అసంపూర్తిగా..



మానకొండూర్‌లో లో లెవల్ బ్రిడ్జిపై పూర్తి కాని తారు రోడ్డు నిర్మాణ పనులు

- మానకొండూర్-జమ్మికుంట రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం
- పూర్తి కాని లో లెవల్ బ్రిడ్జిల నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



అన్నారంలో పూర్తికాని తారురోడ్డు



అన్నారంలో నిలిపివేసిన మురికి కాలువల నిర్మాణం



అన్నారం లో లెవల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

మానకొండూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్-జమ్మికుంట డబుల్ రోడ్డు పనులు ప్రారంభమై ఆరేళ్లు గడిచాయి. ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2018లో అప్పటి రాష్ట్రప్రభుత్వం రూ. 70 కోట్ల నిధులను మంజూరు చేసింది. మానకొండూర్ గ్రామ పంచాయతీ నుంచి మార్కెట్, మసీద్ మీదుగా తూర్పు దర్వాజ బస్టాండ్ నుంచి జమ్మికుంట వరకు ఓ కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాడు. మానకొండూర్, రాఘవాపూర్, అన్నారం, లలితాపూర్, దేవంపల్లి, రంగపేట, పోచంపల్లి, పచ్చునూర్ వరకు సబ్ కాంట్రాక్టర్ పనులను చేపట్టాడు. జమ్మికుంట నుంచి వీణవంక మండలంలోని మామిడాలపల్లి వరకు మరో సబ్ కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. అప్పటి హుజూరాబాద్ ఎమ్మెల్యే మాజీ మంత్రి ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహించిన వీణవంక మండలంలోని మామిడాలపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

అరకొర పనులతో అవస్థలు

మానకొండూర్ మండలంలోని పచ్చునూర్ నుంచి మానకొండూర్ వరకు ఆయా గ్రామాల ప్రజల ఆందోళనలతో అరకొర పనులు చేయడానికి సుమారు ఆరేళ్లు పట్టింది. అన్నారం నుంచి మానకొండూర్ వరకు తారు రోడ్డు లేక ఆరేళ్లు దుమ్ము, ధూళి మధ్య ప్రయాణికులు అనేక ఇబ్బందులతో ప్రయాణం కొనసాగించారు. మానకొండూర్, అన్నారం గ్రామాలలో రోడ్డు వెడెల్పులో జాప్యం అయింది. ఈ రెండు గ్రామాలతో పాటు రాఘవాపూర్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టాలని అనేకసార్లు ఆయా గ్రామాల ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు చేయడమే కాకుండా అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను అడ్డుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆదరబాదరగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో మురికి నీరు ఎక్కడిక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు

లలితాపూర్, అన్నారం, మానకొండూర్ గ్రామాలలోని లో లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పాటు ఇరువైపుల వంద మీటర్ల వరకు తారు రోడ్డు వేయలేదు. దీంతో ఆర్టీసీ బస్సులు, ఇసుక లారీలు వెళ్లే సమయంలో దుమ్ము లేచి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఏడేళ్లుగా వర్షాకాలంలో కురిసే వర్షాలతో ఎగువ నుంచి వచ్చే వరదలో లెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రవహించడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. అన్నారంలో నెల రోజుల క్రితం లో లెవల్ బ్రిడ్జికి ఇరువైపులా పైపులు వేసి మధ్యలో వదిలిపెట్టారు. మానకొండూర్‌లో పూర్తి స్థాయిలో పైపు లైన్ నిర్మాణ పనులు చేపట్టి తారు రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అన్నారంలో అసంపూర్తిగా లో లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు

కంకర తేలి.. ప్రమాదకరంగా..

వీణవంక (ఆంధ్రజ్యోతి): వీణవంక మండల కేంద్రం నుంచి కరీంనగర్ రహదారి పనుల ఆరేళ్లుగా కొనసాగుతున్నాయి. కల్వర్టులు మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో వర్షాకాలం వరద పెరగడంతో తాత్కాలిక రోడ్డు తెగిపోయింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కోర్కల్, శ్రీరాముల పేట గ్రామల మధ్య రోడ్డుపై కంకర తేలింది. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన ప్రజలు కోరుతున్నారు.



వీణవంకలో కంకరతేలిన రోడ్డు

యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్



యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నూతనంగా తీసుకువస్తున్న మార్గదర్శకాలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం శాతవాహన యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ వీసీల నియామకాల్లో ఇండస్ట్రియల్ సెక్టార్ వాళ్లను తీసుకురావడాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. విద్యా వ్యవస్థను ప్రైవేటీకరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యా వ్యతిరేక విధానాలను ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. యూజీసీ నూతన మార్గదర్శకాలను వెనక్కి తీసుకోకపోతే పార్లమెంట్ భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చిట్యాల రాజ్‌కుమార్, దాడి మహేష్, గణేష్, ఉదయ్, భాను, మల్లేష్, దీక్షిత్ పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

వీర్నపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలకేంద్రంలో ఓ కారు గురువారం ఓ కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మద్యం తాగి వాహనాన్ని అతివేగంతో నడపడంతో వాహనం అదుపు తప్పినట్లు ఎస్సై ఎల్లాగౌడ్ పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక

● డిసాలినేషన్‌పై మేడారం విద్యార్థి ఉత్తమ ప్రదర్శన


ప్రదర్శన ఇస్తున్న విద్యార్థి అభిలాష్, గైడ్ టీచర్

ధర్మారం/పెద్దపల్లి కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి) ఉప్పు నీటిని మంచి నీటిగా మార్చే (డిసాలినేషన్) ప్రక్రియలో ధర్మారం మండలం మేడారం ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పి. అభిలాష్ జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 7 నుంచి 9 వరకు జడ్చర్లలో జరిగిన ఇన్‌స్పైర్ మనక్ 2023-2024లో ఉత్తమ ప్రదర్శన కనబరచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 21 నుంచి పుదుచ్చేరిలో జరిగే ప్రదర్శనలో అభిలాష్ పాల్గొననున్నట్లు పాఠశాల హెచ్ఎం వసంత తెలిపారు. సముద్రపు నీటిని మంచి నీరుగా మార్చే డిసాలినేషన్ సోలార్ పరికరాన్ని అభిలాష్ రూపొం దించాడు. పాఠశాల ఫిజిక్స్ గైడ్ టీచర్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ రూపొందించినట్లు అభిలాష్ తెలిపాడు. ఈ సందర్భంగా విద్యార్థిని డీఈవో మాధవి ఒక ప్రకటనలో అభినందించారు.

గంభీరావుపేట మండలం దమ్మన్నపేట విద్యార్థి


ప్రశంసాపత్రం అందుకుంటున్న విశాల్

సిరిసిల్ల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన చిప్పల విశాల్ ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ఎస్వీకేఎం పాఠశాలలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో దమ్మన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి చిప్పల విశాల్, గైడ్ టీచర్ తాడూరి సంపత్‌కుమార్ మార్గదర్శనంలో తయారు చేసిన జంతు మృత దేహాలను తొలగించే ట్రాలీ ఆవిష్కరణను ప్రదర్శించాడు. జాతీయస్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థితో పాటు గైడ్ టీచర్ సంపత్‌కుమార్‌కు ప్రశం సాపత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థి విశాల్‌తో పాటు గైడ్ టీచర్‌ను జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, సైన్స్ అధికారి పాముల దేవ య్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు అభినందించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


అక్షయ


గంభీరావుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని అక్షయ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో జనవరి 10 నుంచి 14 వరకు జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అక్షయ పాల్గొంటారు. అక్షయ తెలంగాణ టీం హ్యాండ్ బాల్ జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నారు. పాఠశాల హెచ్ఎం వెంకటరామారావు, ఉపాధ్యాయ బృందం అక్షయను అభినందించారు.

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఆర్జీ-2 ఉద్యోగి


నవీన్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరగనున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఆర్జీ-2కు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకుడు అనుమాండ్ల నవీన్‌కుమార్ హాజరుకానున్నారు. ఈ నెల 10,11 తేదీల్లో జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్ అండ్ ఇండియా ఎక్స్‌పర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ జరగనున్నది. 'ఇంప్రూవింగ్ హెల్త్ అండ్ సేఫ్టీ ఎట్ వర్క్‌ప్లేస్ అండ్ ఇంప్రూవ్ నెగోషియేషన్ స్కిల్స్ ఫర్ కాన్‌ఫ్లిక్ట్ రెసల్యూషన్' అనే అంశంపై వర్క్‌షాప్ జరగనున్నది. ఐఎన్‌టీయూసీ ప్రతినిధిగా ఓసీపీ-3 సీహెచ్‌పీలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న నవీన్‌కుమార్ వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు.

రామగుండంలో బొగ్గు దందా..


వ్యాగన్ నుంచి బొగ్గును చోరీ చేస్తున్న వ్యక్తులు (ఫైల్)

● మళ్లీ రంగంలోకి పాత స్మగ్లర్లు
● ఎన్‌టీపీసీకి రవాణా అయ్యే వ్యాగన్ల నుంచి చోరీ
● లక్ష్మీపురం, మారేడుపాక, ఎల్కలపల్లి గేట్‌ల్లో ముఠాలు
● హైదరాబాద్‌కు, ఇటుక బట్టీలకు టన్నుల కొద్దీ బొగ్గు తరలింపు

కోల్‌సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో మళ్లీ కోల్ మాఫియా కార్యకలాపాలు మొదలుపెట్టింది. గతంలో పీడీ యాక్టులు, కేసులతో కొంత వెనక్కి తగ్గిన స్మగ్లర్లు మళ్లీ తమ బొగ్గు దందా మొదలుపెట్టారు. సింగరేణి నుంచి ఎన్‌టీపీసీకి రవాణా అయ్యే బొగ్గును రైల్వే వ్యాగన్ల నుంచి చోరీ చేసి ఇటుక బట్టీలు, హైదరాబాద్‌లోని పరిశ్రమలకు తరలిస్తున్నారు. లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్, మారేడుపాక గ్రామాల్లో ముఠాలను ఏర్పాటు చేసుకున్న స్మగ్లర్లు ప్రతి రోజు తెల్లవారు జామున 2గంటల నుంచి 5 గంటలలోపు బొగ్గును రవాణా చేస్తున్నట్టు సమాచారం.

గోదావరిఖని వన్ సీఎస్‌పీ, ఓసీపీ-3 సీహెచ్‌పీ, ఓసీపీ-1 సైలోల నుంచి ఎన్‌టీపీసీకి బొగ్గు రవాణా జరుగుతుంది. రేకులు కూడా టైమ్ టేబుల్ ప్రకారం వెళతాయి. రైలు మార్గం ఉన్న మారేడుపాక, లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్ మధ్య వ్యాగన్ల నుంచి బొగ్గు తీస్తున్నారు. చీకటి పడిందంటే మారేడుపాక రైలు గేటు సమీపంలోనే పదుల సంఖ్యలో వ్యక్తులు బొగ్గు దొంగతనాలు చేసేందుకు వ్యాగన్లకు ఎక్కి నిర్దేశిత ప్రాంతంలో బొగ్గును కింద పడేస్తున్నారు. అనంతరం డంపు చేసి బొగ్గు స్మగ్లర్లకు బస్తాకు రూ.30 నుంచి రూ.50 చొప్పున అప్పగిస్తున్నట్టు తెలుస్తోంది. స్మగ్లర్లు మార్కెట్‌లో సింగరేణి బొగ్గును టన్నుకు రూ.9 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. జిల్లాలోని ఇటుక బట్టీలతో పాటు హైదరాబాద్ పరిశ్రమలకు కూడా ఈ బొగ్గును దొడ్డి దారిన తరలిస్తున్నట్టు తెలుస్తోంది.


ఇటీవల సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న బొగ్గు (ఫైల్)

రక్షణ విభాగాల పరోక్ష సహకారం..

బొగ్గు చోరీలకు సింగరేణి, ఎన్‌టీపీసీ రక్షణ విభాగాలు కూడా పరోక్షంగా సహకరిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. గతంలో సింగరేణి, ఎన్‌టీపీసీ రక్షణ విభాగాలు, పోలీస్ శాఖ కలిసి జాయింట్ ఆపరేషన్లు చేసేవి. దాంతో పకడ్బందీగా చోరీలను అరికట్టారు. ఈసారి ఆయా శాఖల మధ్య సమన్వయం కొరవడింది. తమ గనుల పరిధి దాటితే తమకు సంబంధం లేదని సింగరేణి, సింగరేణిదే బాధ్యత అంటూ ఎన్‌టీపీసీ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఎందరో క్షతగాత్రులు...

బొగ్గు చోరీ ఇది సామాజిక సమస్యగా మారింది. గతంలో ఎఫ్‌సీఐ మూత పడడంతో పరిసర ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి లేక బొగ్గు చోరీలకు పాల్పడేవారు.. స్మగ్లర్లు పిల్లలను కూడా ఈ దందాలోకి దించేవారు. లక్ష్మీపురం, ఎల్కలపల్లి, మారేడుపాక, గోదావరిఖని రాంనగర్‌కు చెందిన పలువురు బొగ్గు తీసే క్రమంలో ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు. కొంతమంది ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. పోలీసులు ఈ దందాపై ఉక్కుపాదం మోపి పలువురిని బైండోవర్ చేయడంతోపాటు కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. దీంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి. ఇప్పుడు మళ్లీ స్మగ్లర్లు ఈ దందాను మొదలు పెట్టడంతో ఆర్ఎఫ్‌సీఎల్ పరిసర ప్రాంతాలపై దీని ప్రభావం పడనున్నది.

మూడు ఠాణాల పరిధిలో దందా...

స్మగ్లర్లు ఎంపిక చేసుకున్న ప్రాంతాలు మూడు ఠాణాల పరిధిలోకి వస్తాయి. ఎన్‌టీపీసీ, గోదావరిఖని టూటౌన్, బసంత్‌నగర్ ప్రాంతాల్లో బొగ్గు చోరీలు, రవాణాకు కేంద్రాలుగా మారాయి. ఈ దందా నిరాటంకంగా సాగేందుకు స్మగ్లర్లు తమ పాత పరిచయాలు ఉపయోగించుకుంటున్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రెండు నెలలుగా దందా నిరాటంకంగా సాగుతున్నా ఎక్కడా కూడా పోలీస్ కేసులు నమోదు కాలేదు.



అడపాదడపా దాడులు చేసి నిల్వ ఉంచిన బొగ్గును మాత్రం సింగరేణి సెక్యూరిటీ విభాగం స్వాధీనం చేసు కుంటోంది. ఎన్‌టీపీసీ వద్ద సీఐఎస్ఎఫ్ యూనిట్లు ఉన్నా కనీస గస్తీ పెట్టిన పరిస్థితి లేదనే ఆరోపణలున్నాయి. బొగ్గు రవాణా అయ్యే గూడ్స్ సిబ్బందే సహకారం అందిస్తున్నట్టు కూడా ఆరోపణలున్నాయి.


రైల్వే ట్రాక్ వెంట బొగ్గు బస్తాలు (ఫైల్)

పండుగకు ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త



కరీంనగర్ క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులను పురస్కరించుకొని ఊరెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. బంగారం, నగదు, ఇతర విలువైన సొత్తును ఇళ్లలో పెట్టుకోకుండా బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచు కోవాలని లేదా వెంట తీసుకుపోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వెల్లడించారు.

● తాళంవేసిన ఇళ్లల్లో లైట్లను వేసి ఉంచాలి.
● ఇళ్లల్లోని సీసీ కెమెరాలను తరచుగా పరిశీలించి, అనుమానం ఉంటే స్థానికంగా ఉండే బంధువులు, సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలి.
● తాళం వేసిన సంగతి తెలియకుండా తలుపునకు కర్టెన్ వేయాలి.
● బంగారం, వెండి నగలు, ఇతర విలువైన వస్తువులు, సొత్తు ఇంట్లో పెట్టకూడదు.
● బీరువా తాళాలు ఇంట్లో పెట్టకూడదు.
● ఇళ్ల ప్రధాన ద్వారం వద్ద చెప్పులు ఉండేలా చూడాలి.

ముక్కోటికి ముస్తాబైన ఆలయాలు


వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఏర్పాట్లు


ధర్మపురి ఆలయంలో పూలతో అలంకరించిన ఉత్తర ద్వారం

వేములవాడ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ఘనంగా ఏర్పాట్లు చేపట్టారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామునే ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం కల్పించడంతో ఆలయంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 5.10 గంటల స్వామివారి పల్లకి సేవ ప్రవేశం అనంతరం పెద్ద సేవ పైన ఆలయం చుట్టు ప్రదక్షిణలు నిర్వహించి అనంతరం ఉత్తర ద్వార దర్శనం కల్పించనన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి : ముక్కోటి ఏకాదశి సందర్భంగా ధర్మపురి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి అధికారులు ఏర్పాటు చేశారు. ఉత్తరద్వారాన్ని పూలతో అందంగా పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ధర్మపురి పట్టణ, పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఆలయ అధికారులు, సిబ్బందికి కలిసి ఆయన పలు సూచనలు చేశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కిరణ్, రవికిరణ్, ఆర్‌ఐ కిరణ్ ఉన్నారు.

కొండగట్టులో..


మల్యాల : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఉత్తర ద్వారాన్ని ప్రత్యేకించి అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. ఆలయంలో కోయిల్ తిరుమంజనమ్ సేవ నిర్వహించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వస్త్ర చిత్ర కళా ఉద్యమి (ఎంబ్రాయిడరీ వర్క్స్)లో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభించి 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7981151653, 9849 411002 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యా సమాచారం

16 నుంచి ఎల్ఎల్‌బీ పరీక్షలు



గణేశ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్‌బీ ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

● 21 నుంచి పీజీ, ఎంబీఏ పరీక్షలు

ఎస్‌యూ పరిధిలోని పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షల పూర్తి సమాచారం www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో చూడాలని ఆయన సూచించారు.

ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు 21నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.


అసంపూర్తిగా ఉన్న వెజ్ మార్కెట్ భవన నిర్మాణం

సమీకృత మార్కెట్ పూర్తయ్యేది ఎప్పుడో..?

● ఇబ్బందులు పడుతున్న విక్రయదారులు ● ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ప్రజలు

మెట్‌పల్లిటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వార సంత కారణంగా పాత బస్టాండ్‌లోని వెల్లుల రోడ్డు, మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ సంతకు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, భీంగల్, మోర్తాడ్, ఆర్మూర్ మండలాలతో పాటు, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం నిజామాబాద్, జగిత్యాల జిల్లా కేంద్రాలకు చెందిన వ్యాపారులు క్రయ విక్రయాల కోసం వస్తుంటారు. సంతకు వచ్చే వారికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కనే మాంసం, కూరగాయలు, ఇతర విక్రయాలు జరుగుతుండటంతో వ్యర్థాలతో రోడ్డు అపరిశుభ్రంగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు డివిజన్ పరిధిలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని వెల్లుల రోడ్డులో సమీకృత మార్కెట్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి 10.50 కోట్ల నిధులను కేటాయించింది.

అప్పటి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు దీంతో పట్టణ ప్రజలకు ఇటు ట్రాఫిక్ సమస్య తీరుతుందని, మార్కెట్ల నిర్మాణంతో వివిధ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ అవి ఆచరణలో మాత్రం ముందుకు సాగడం లేదు.

వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పను లు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను మొదట్లో వేగంగా చేసాడు. కానీ బిల్లులు రాకపోవడంతో మార్కెట్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న విధంగా తయారయ్యాయి. పనులు ప్రారంభి ఏళ్లు పూర్తి కావస్తున్నా నేటికి పూర్తి కాకపోవడంతో చిరు వ్యాపారులు, మాంసం దుకాణదారులు, పల్లెల నుంచి వచ్చి కూరగాయలు అమ్మే రైతులు రోడ్డు వెంట విక్రయాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో పాటు, ఆహారపదార్థాలు, మాంసం విక్రయాలతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీకృత మార్కెట్ భవన నిర్మాణం పూర్తి చేయడానికి అధికారులు, అధికార పార్టీ నాయకులు చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తీరనున్న ట్రాఫిక్ సమస్య

ప్రతీ మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్, వెల్లుల రోడ్డు, మార్కెట్ రోడ్డులో వార సంత ఉంటుంది. అదే విధంగా మంగళవారం వార సంత నిర్వహిస్తుండటంతో వెల్లుల ఎల్లమ్మకు వారు కూడా అదే రోడ్డు వెంబడి వెళ్తుంటారు. దీంతో ఆ ప్రాంతం అంతా ప్రజలతో కిక్కిరిపోతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అంతే కాకుండా వాహనాలు సైతం ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో నిలిపి క్రయవిక్రయాలు చేస్తుండంతో నిలబడేందుకు కూడా స్థలం ఉండడం లేదు. సాయంత్రం సమయంలో ఆటోలు, పాఠశాలల బస్సులు రోడ్డుపైకి రావడంతో ప్రజలు రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమీకృత మార్కెట్ భవనం పూర్తియైతే ఈ సమస్య ఉండదు.


అసంపూర్తిగా ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ భవనం

సమీకృత మార్కెట్‌లోనే అన్ని సౌకర్యాలు

సమీకృత మార్కెట్‌లో మాంసం, కూరగాయలు, పూలు,పండ్లు, ఇతర రకాల వస్తువులు అన్ని ఒకే చోట విక్రయించేలా మార్కెట్ భవనాలు నిర్మిస్తున్నారు. ఇందుకోసం అవసరం మేరకు షెడ్ల నిర్మాణాలు చేస్తున్నారు. వీధి దీపాలు, సీసీ రోడ్లు, మంచి నీరు, టాయిలెట్స్ ఇతర మౌలిక సదుపాయలను కల్పిస్తున్నారు. ఎండ, వానా కాలాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బంది లేకుంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. విద్యుత్ వెలుగులతో రాత్రి పూట కూడా మార్కెట్ సదుపాయం ఉంటుంది.

ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి

దొనికెల నవీన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మెట్‌పల్లి




ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి మంగళవారం అక్కడకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ భవనం పూర్తి చేసి వినియోగంలోకి తెస్తే సమస్య పరిష్కారం అవుతుంది.


ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి


● సీఎంకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ లేఖ

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంయిర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బహిరంగ లేఖ రాశారు. విద్య, వైద్యం విషయంలో కాంగ్రెస్ తీరు కోట్లాది మంది ప్రజలను తీవ్రమైన ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు బాగా లేదన్నారు. ఒక వైపు ఆరోగ్యశ్రీ పరిమితి పది లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. కానీ అసలు ఆరోగ్యశ్రీ బిల్లులే చెల్లించకుండా వైద్య సేవలు ప్రజలకు అందకుండా చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఏడాది పాలనలో ఆరోగ్య శ్రీ బకాయిలు వేయి కోట్లకు పైగా పేరుకు పోయాయని బండి సంజయ్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల 7 వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలు పేరుకు పోయాయన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ అందక కళాశాలల యాజమాన్యాలు మూతపడే పరిస్థితి ఉందన్నారు. యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 8 వేల కోట్లు చెల్లించి లక్షలాది మంది రోగులు, విద్యార్థులను ఆదుకోలేరా అని బండి సంజయ్ ప్రశ్నించారు. విదేశీ పర్యటనలు, ఢిల్లీ పర్యటనలు, మూసీ పునరుజ్జీవం, ఫోర్త్ సిటీ పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వైద్యం, విద్యపై ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని, లేకుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డి నాయకత్వంలో విద్యార్థులు, పేదలతో కలిసి ఉద్యమిస్తామని లేఖలో హెచ్చరించారు.

ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్


జిట్టవేణి శ్రీను


జెట్టిపల్లి అశోక్


కలిగేటి శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్‌గా జిల్లాకు చెందిన జిట్టవేని శ్రీను, జెట్టిపల్లి అశోక్, కలిగేటి శ్రీనివాస్‌లు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్‌లో ఈ నెల 10 నుంచి 14 వరకు జరగనున్న పోటీలకు వీరిని టెక్నికల్ అఫీషియల్స్‌గా నియమిస్తూ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపికైన వారిని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, మహమ్మద్ యూనిస్‌పాషా, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్‌రెడ్డి, సీనియర్ పీడీలు సంపత్‌రావు, కే కృష్ణ బాబు శ్రీనివాస్, గిన్నె లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

న్యూస్ బాక్స్

పెరుగుతున్న చలి

- 9.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

సిరిసిల్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో చలి తీవ్రత మళ్లీ పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ప్రజలు ఉదయం వేళల్లో బయటకు రావడానికి ఇబ్బందులు పడుతన్నారు. గురువారం జిల్లాలోని గంబీరావుపేటలో 9.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రుద్రంగిలో 9.7, బోయినపల్లిలో 10.1, వీర్నపల్లిలో 10.7,తంగళ్లపల్లి, చందుర్తిలో 10.8, వేములవాడ రూరల్ 11.6, ముస్తాబాద్, కోనరావుపేట 11.8, వేములవాడలో 12.4, ఇల్లంతకుంటలో 12.7, సిరిసిల్లలో 13.4 డగ్రీలుగా నమోదైంది.

ఇళ్లకు నష్టపరిహారం చెల్లించండి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మధ్య మానేరు జలాశయంలో ముంపునకు గురైన సంకెపల్లి గ్రామంలోని 45 ఇళ్లకు సంబంధించిన నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని నిర్వాసితులు గురువారం సిరిసిల్ల కలెక్టరేట్‌కు గురువారం తరలివచ్చారు. వేములవాడ అర్బన్ మండలంలోని సంకెపల్లి గ్రామంలో 45 ఇళ్లకు సంబంధించి జనరల్ అవార్డును చేసి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాసితులు నాగరాజు, శ్రీనివాస్, దుర్గయ్య, బాలయ్య, రమేష్, శంకర్, మారవేణి రాజయ్య, కొండయ్య, పండుగ దేవయ్య, అంజయ్య, నారాయణ, మల్లయ్య, చంద్రయ్య, లస్మయ్య, గోపాల్, దేవయ్య పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

గంబీరావుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వంచ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. 2024-2026కు సంబంధించి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉత్సహంగా చేపట్టారు. గతంలో టీడీపీలో పనిచేసి ఇతర పార్టీలో ఉన్నవారితో పాటు తటస్థంగా ఉన్న వారు పార్టీ సభ్యత్వ నమోదును స్వీకరించారని శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు చేపూరి ప్రభాకర్, ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి దేవతలు దిగి వచ్చే వేళ..

- వేములవాడ రాజరాజేశ్వరస్వామి, సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు - ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శనం - నేడు వైకుంఠ ఏకాదశి



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

దేవతలందరూ దివి నుంచి భువికి దిగి వచ్చే పర్వదినం వైకుంఠ ఏకాదశి అని భక్తుల నమ్మకం. ప్రతీ సంవత్సరం మార్గశిర మాస శుక్లపక్ష ఏకాదశి నాడు జరుపుకుంటారు. దీనిని ముక్కోటి ఏకాదశిగా పిలుస్తారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వారం గుండా స్వామి వారు దర్శనమివ్వనుండడంతో దేవాలయాలను ముస్తాబు చేశారు. జిల్లాలో ప్రధానమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారుజామున 3.10 నుంచి 3.40 గంటల వరకు సుప్రభాతం, 3.40 నుంచి 3.50 వరకు ఆలయ శుద్ధి, 3.50 నుంచి 5 గంటల వరకు శ్రీ స్వామి వారికి ప్రాతఃకాల పూజ అనంతరం ఉదయం 5.10 గంటలకు పల్లకీసేవపై ఉత్తర ద్వారా స్వామి వారి ప్రవేశం అనంతరం దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు దేవాలయాల్లో ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాటు చేశారు. అనంతరం లక్ష్మీవేంకటేశ్వరస్వామి గరుడ సేవపై ఊరేగనున్నారు. ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశి.. వైకుంఠ ఏకాదశిగా ప్రసిద్ధి చెందింది. వైకుంఠ ఏకాదశి రోజు విష్ణు ఆలయాల్లో ఉత్తర ద్వారాన్ని తెరిచి ప్రత్యేక ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

● ఉత్తర ద్వార దర్శనం ఎందుకు..

వైకుంఠ ఏకాదశి నాడు ఆచరించాల్సిన పనుల్లో వైకుంఠ ద్వారా దర్శనం ప్రధానమైనది. దాన్నే ఉత్తర ద్వార దర్శనం అంటారు. వైకుంఠ ఏకాదశి రోజు వైష్ణవ దేవాలయాల్లో ఉత్తరం వైపున ఉన్న ద్వారం తెరుస్తారు. ఈ ద్వారానికే వైకుంఠ ద్వారమని పేరు. వైకుంఠ ఏకాదశి నాడు తెల్లవారుజామునే వైకుంఠ ద్వారం నుంచి వెళ్లి దైవదర్శనం చేసుకుంటే సర్వపాపాలు పోతాయని విశ్వాసం. ఆళ్వార్‌లలో ఒకరైన నమ్మాళ్వారు ఈ రోజునే పరమపదించినందున వైష్ణవులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

వేడుకలకు ఆలయాలు ముస్తాబు

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాలలోని ఆలయాలు ముక్కోటి ఏకాదశికి ముస్తాబు అయ్యాయి. జంగమరెడ్డిపల్లె గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, పొత్తూరు గ్రామంలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం, రేపాక గ్రామంలోని శ్రీరామాంజనేయ ఆలయాల్లో శుక్రవారం ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారలను దర్శించుకోనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు కమిటీల సభ్యులు తెలిపారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనాలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం టీజీఆర్టీసీ సిరిసిల్ల డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ హాజరై రోడ్డు భద్రతపై ఆర్టీసీ సిబ్బంది, కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడవద్దని సూచించారు. డిపో మేనేజర్ అశోక్ మాట్లాడుతూ రవాణాశాఖ అధికారులు సూచించిన సూచనలను పాటిస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ శశిధర్, డిపో ఏఎంఎఫ్ హర్బజన్‌సింగ్, కార్యాలయం సూపరింటెండెంట్ నక్కశ్రీనివాస్, అకౌంటెంట్ వేణు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, రామ్‌రెడ్డి, హెడ్‌గార్డ్ ఏ రాజేందర్‌రెడ్డి, డ్రైవర్లు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండపల్లి అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్లో జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో రవాణా శాఖ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందు తున్న విద్యార్థులకు రోడ్డు మార్గదర్శకాలను వివరించారు. ఎంవీఐ వంశీధర్, అసిస్టెంట్ ఎంవీఐలు రజనీదేవి, పృథ్వీరాజ్‌వర్మ, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ దురై మురుగన్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ ప్రకాష్, పక్కన జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్

మాఘ అమావాస్య జాతర ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాఘ అమావాస్య జాతరను ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి దత్తత దేవాలయం సీతారామస్వామి ఆలయాన్ని మాఘ అమావాస్య జాతర సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జనవరి 29 రోజున మాఘ అమావాస్య జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా జరగాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో వెంటనే కాంట్రాక్టు రద్దుచేసి నూతనంగా టెండర్లకు పిలవాలని తెలిపారు. కార్యక్రమంలో వేములవాడ ఈవో వినోద్‌రెడ్డి, తహసీల్దార్ విజయప్రకాష్‌రావు, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, శశి, దివ్య, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'మల్కపేట'పై ఆశలు

(3వ పేజీ తరువాయి..)

ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు మొదలు కావడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఉండవని, తాగు, సాగు నీరు గోస తీరుతుందని భావిస్తున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని ప్రాజెక్టులకు సిరిసిల్ల మానేరు తీరం వారధిగా మారింది. సిరిసిల్ల మానేరు వాగుపై 27 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టు నీటినిల్వతో 18 కిలోమీటర్ల మేరకు బ్యాక్ వాటర్‌తో జలకళ సంతరించుకుంది. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో 25.80 టీఎంసీల నీరు మిడ్ మానేరులో నిల్వ ఉంది. మిడ్‌మానేరు ప్రాజెక్టుకు అనుసంధానంగానే జిల్లాలోని అనంతారం అన్నపూర్ణ ప్రాజెక్టును నిర్మించారు. ఆసియాలోనే అతిపెద్దదైన సర్జిపూల్ బావిని నిర్మించి అనంతగిరి ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోయడం ద్వారా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండ పోచమ్మసాగర్ వరకు కాళేశ్వరం జలాలను పరుగులెత్తించే అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. జిల్లానుంచి గోదావరి జలాలు ఎత్తిపోతలతో ఇతర జిల్లాలకు తరలివెళ్తుంటే సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని మెట్ట ప్రాంతాల రైతులు కాళేశ్వరం 9వ ప్యాకేజీ ద్వారా కాల్వల నిర్మాణం, నిజాం కాలంలో నిర్మించిన ఎగువ మానేరు ప్రాజెక్టుకు నీటి మళ్లింపుతో పాటు తొమ్మిదేళ్లుగా మూడు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే మల్కపేట రిజర్వాయర్ అందుబాటులోకి వస్తుందని ఎదురు చూస్తున్నారు.

● రూ. 996 కోట్లతో 9వ ప్యాకేజీ పనులు..

జిల్లాలోని కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనుల ద్వారా సిరిసిల్ల, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంబీరావుపేట మండలాల్లో భూగర్భజలాలు పెరగడంతో ఆయకట్టు పెరుగుతుందని అంచనాలు వేశారు. సిరిసిల్ల మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి ఎగువ మానేరు ప్రాజెక్టు వరకు 9వ ప్యాకేజీ పనులకు రూ. 996 కోట్లతో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కోనరావుపేట మండలం మల్కపేట వద్ద మూడు గుట్టలను అనుసంధానం చేసుకొని ఆరు కట్టలతో మూడు టీఎంసీల సామర్థ్యంతో రూ. 504 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు త్వరలోనే అందుబాటులోకి వస్తుందని భావించినా రైతులకు నిరాశే మిగిలింది. ట్రయల్‌రన్ పూర్తి చేసుకొని యేడాది గడిచినా కొత్త ప్రభుత్వం దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. సిరిసిల్ల రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి మల్కపేట ప్రాజెక్టు వరకు నీటిని మళ్లించడానికి 12 కిలోమీటర్ల టన్నెల్ నిర్మించారు. అక్కడ సర్జిపూల్ బావిని నిర్మించారు. 30 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు పంపుల ద్వారా 560 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తారు. మల్కపేట రిజర్వాయర్ ప్రారంభం అయితే దాని ద్వారా ఎగువ మానేరు ప్రాజెక్టులోకి రెండు టీఎంసీలు, బత్తుల చెరువులో రెండు టీఎంసీలు నింపడంతో పాటు వాటి పరిధిలో ఉన్నా చెరువులు నిండడం ద్వారా 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టు పెరగనుంది. ఇప్పటికే సింగసముద్రం వరకు కాలువల నిర్మాణాలు కూడా జరిగాయి. మల్కపేట రిజర్వాయర్ ప్రారంభిస్తే జిల్లాలో సమృద్ధిగా సాగునీటి వనరులు రైతులకు అందుబాటులోకి వస్తాయని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల సందర్శన

వీర్నపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మండలంలోని తహసీల్దార్, మండల పరిషత్, మండల విద్యాశాఖ, పోలీస్‌స్టేషన్, అటవీ శాఖ కార్యాలయాలను గురువారం పరిశీలించారు. కార్యాలయాల పనితీరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మారుతిరెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎల్లాగౌడ్, అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్ఎస్‌వోలు పద్మలత, రంజిత్‌కుమార్ ఆయా శాఖల వివరాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా రాణించి ప్రభుత్వ ఉద్యోగాలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



సిరిసిల్ల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ బాలికల జిల్లాపరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సిరిసిల్ల టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పదవి విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం 2024 మార్చి నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు జిల్లా ట్రెజరీ అధికారి నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం రాత్రి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆవిష్కరించారు.

భూమిపూజ



తంగళ్లపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలం నేరెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సైన్స్‌ల్యాబ్ నిర్మాణానికి రూ 11 లక్షలు మంజూరు కాగా నాయకులు గురువారం భూమిపూజ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ధైర్యసాహసాలతో విధులు నిర్వహించాలి



సర్దాపూర్ బెటాలియన్‌లో మాట్లాడుతున్న కమాండెంట్ గంగారాం

సిరిసిల్ల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో శిక్షణ పొందుతూనే ధైర్య సాహసాలతో ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ గంగారాం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ప్రత్యేక పోలీస్ విభాగంలో ఎంపికై 9 నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న 313 మంది కానిస్టేబుల్స్ గురువారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కమాండెంట్ మాట్లాడుతూ విధి విధానాలను తెలుసుకోని సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. పోలీస్ ఉద్యోగం ఎప్పుడూ సవాళ్లు, త్యాగాలతో ముడిపడి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ రాందాస్, అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై వాల్ పోస్టర్లు



వెలసిన వాల్ పోస్టర్లు

తంగళ్ళపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్ళపల్లి మండలంలోని పలు గ్రామాల కూడళ్లలో రైతు భరోసా ఇవ్వాలంటూ వాల్ పోస్టర్లు వెలిశాయి. ఎగ్గొట్టిన రైతు భరోసా ఎప్పుడు వేస్తావు రేవంత్..? కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో ఎకరానికి రైతు భరోసా రూ 17,500 తదితర అంశాలను ప్రస్తావిస్తూ వాల్ పోస్టర్లు వెలిశాయి. పోస్టర్ల విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఇది బీఆర్ఎస్ నాయకుల పనేనని ఆరోపించారు. పోస్టర్ల విషయంపై పోలీస్ శాఖ, ఇంటెలిజెన్స్ అధికారులు సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది.

సంక్షిప్త సమాచారం..

చందుర్తి: మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన జి రుచిత అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతుండగా రెండు లక్షల 50 వేల విలువైన ఎల్‌వోసీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేశారు.

సిరిసిల్ల: ఈనెల 29న జరిగే శ్రీరామప్ప రామలింగేశ్వరస్వామి జాతర పోస్టర్‌ను సిరిసిల్ల సీఐ కృష్ణ ఆవిష్కరించారు. సిరిసిల్ల నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మాఘ అమవాస్య సందర్భంగా సిరిసిల్ల మానేరు తీరంలో నిర్వహించే జాతర, వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు.

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కేతిరెడ్డి నవీన్‌రెడ్డి ఎల్ఈడీ లైట్లను గురువారం వితరణ చేశారు.

తంగళ్లపల్లి: మండలంలోని బద్దనపల్లి బాలికలగురుకులంలో విద్యార్థులకు మానసికఆరోగ్యంపై సైక్రియాటిస్టు డాక్టర్‌ప్రవీణ్ అవగాహన కల్పించారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని సహస్ర జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిద్దిరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో రుణాలు, స్వయం సహాయక సంఘాల పాలకవర్గం ఎన్నికల విధానాలపై మహిళా సంఘాల ప్రతినిధులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. సమావేశంలో డీపీఎం పద్మయ్య, జిల్లా ఏపీఎం రాజేశం, ఏపీఎం మల్లేశం, సీసీలు మంగ్యానాయక్, దేవేందర్, సుదర్శన్, నాగరాజు, సుధాకర్, రమణ, పద్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, గ్రా మాఖ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ బండలింగంపల్లి గ్రామంలోని వివిధ కుల సంఘాల సభ్యులు గురువారం మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని 262 సర్వే నంబరులో గల 11.38 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు కబ్జా చేసుకుని సాగు చేస్తున్నారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను ముందస్తు అరెస్టులు చేసి సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ కు తరలించారు. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావును గురువారం హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలో అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పోలీసులు సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధు లు, నాయకులను ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు గుండ్లపెల్లి పూర్ణచందర్, దార్ల సందీప్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ అరెస్ట్ అయినవారిలో ఉన్నారు.

తంగళ్లపల్లి: కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్న నేపథ్యంలో తంగళ్లపల్లి మండలంలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. గురువారం మధ్యాహ్నం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నా యకులు సురభి నవీన్‌రావ్, నక్క కొమురయ్య, రమణ తదితరులను ఉన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే భూకబ్జాలు

సిరిసిల్ల టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్నసిరిసిల్ల పరిధిలో ప్రభుత్వ భూములను కబ్జాచేసిన వారందరు 250 ఎకరాల భూమిని కలెక్టర్‌కు తిరిగి ఇచ్చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ఏ పార్టీ వారైన సరే కేసులు కాకముందే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుబాల వెంకటేశం, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, భీమ వరం శ్రీనివాస్, అల్లె బాలరాజు, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మల్కపేట జలాశయం సందర్శన

ఎల్లారెడ్డిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట జలాశయాన్ని ఎల్లారెడ్డిపేట మండలంలోని కాంగ్రెస్ నాయకులు గురువారం సందర్శించారు. మధ్య మానేరు నుంచి మల్కపేట జలాశయం పంపింగ్ ద్వారా వచ్చే నీరు, ఎగువ మానేరుకు వెళ్లే తొమ్మిదవ ప్యాకేజీ కాల్వను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, దేవేందర్‌యాదవ్, శ్రీనివాస్, బాబు తదితరులు ఉన్నారు.

బాలుడికి మెరుగైన వైద్యం

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురైన బాలుడికి మెరుగైన వైద్యంతో పాటు విద్యను అందించేందుకు కృషిచేస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా భరోసా కల్పించారు. ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన రమావత్‌చందు కుమారుడు రమావత్ రోహిత్ ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్నాడు. ఇటీవల పాముకాటుకు గురైన గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందాడు. బాలుడి వైద్యానికి ఖర్చులకు సంబంధించిన లక్షా 50 వేల రూపాయల విలువైన చెక్కును గురువారం కలెక్టరేట్‌లో బాలుడి తల్లిదండ్రులు రమావత్ చందు-రజి త దంపతులకు కలెక్టర్ అందజేశారు. రోహిత్‌ను పదోతరగతి వరకు చదువు కునేందుకు మెరుగైన విద్య అందిస్తామని భరోసా కల్పించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి



సిరిసిల్లలో విద్యార్థినులకు అల్పాహారాన్ని అందిస్తున్న ప్రత్యేక అధికారి వసుంధరాదేవి

సిరిసిల్ల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్మీడి యట్ బోర్డు ప్రత్యేక అధికారి వసుంధరా దేవి సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని సెస్ బాలికల జూనియర్ కళాశాలను గురువారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన రికార్డుల ను తనిఖీలు చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావే శాన్ని నిర్వహించి విద్యాప్రగతి, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ పరీక్షల కోసం విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడిలేకుండా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని అందించి కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజకుమారీ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివేలా చర్యలు తీసుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడి యట్ బోర్డు అబ్జర్వర్ వసుందరాదేవి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆమె సందర్శించారు. కళాశాల రికార్డులు, తరగతి గదులు పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు అల్పాహార పంపిణీని ప్రారంభించారు. డీఐఈవో శ్రీనివాస్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పరుశరాములు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

కోనరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను వసుంధ రాదేవి సందర్శించారు. విద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని వాటికి అనుగుణంగా భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి లెక్చరర్స్ రిపోర్టులను వారి సిలబస్ ప్రణాళికలను పరిశీలించి సూచనలు చేశారు. సందర్భంగా ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, అధ్యాపకులు ఉన్నారు.